RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 129 | జూన్ 09 మంగళవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 129 | JUN 09 Tuesday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


పాఠశాలల కుదింపుపై సీఎం రేవంత్ తీరుపై కవిత తీవ్ర ఆగ్రహం 2

## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో

# ఘోర ప్రమాదం

### ఉక్కుద్రవం పడి 9 మంది కార్మికులు దుర్మరణం



**విశాఖపట్నం జనసంఘర్షణ :**
విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో సోమవారం అత్యంత ఘోర ప్రమాదం సంభవించింది. ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2, ఎస్‌టీసీ-3 విభాగంలో సుమారు 1,500 డిగ్రీల తీవ్రమైన వేడితో కూడిన స్టీల్ మెటల్ లిక్విడ్ లాడిల్ ద్వారా ఉక్కుద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా, ఒక్కసారిగా ల్యాడిల్ పేలి ఉక్కుద్రవం లీకై మంటలు చెలరేగాయి. మెటల్ ల్యాడల్ నుంచి బకెట్లు కుప్పకూలడంతో అందులోని మరుగుతున్న ద్రవ లోహం అకస్మాత్తుగా అక్కడ పనిచేస్తున్న కార్మికులపై పడింది. ఈ దుర్ఘటనలో ప్రమాద స్థలంలోనే తొమ్మిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో ప్లాంట్‌లో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో తీవ్ర భయాందోళనకు గురైన కార్మికులు, ఉద్యోగులు ప్రాణాలు రక్షించుకోవడానికి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్లాంట్ యాజమాన్యం వెంటనే అత్యవసర భద్రతా చర్యలు చేపట్టి, క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం సమీప ఆసుపత్రులకు తరలించింది. ఈ ఘోర కలకలంతో ప్లాంట్ పరిసరాల్లో ఆందోళనకర పరిస్థితులు

➤ మిగతా 2వ పేజిలో..

## ఇరాన్‌ను తక్షణమే వీడాలి

- భారతీయులకు విదేశాంగ శాఖ విజ్ఞప్తి
- పశ్చిమాసియాలో ముదిరిన ఉద్రిక్తతలు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో పశ్చిమాసియా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇరు దేశాల మధ్య దాడులు ప్రతిదాడులు పతాక స్థాయికి చేరడంతో, టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) అక్కడ నివసిస్తున్న భారతీయ పౌరుల కోసం అత్యవసర ప్రయాణ మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా భారతీయ పౌరులు ఎవరూ ఇరాన్‌కు ప్రయాణాలు పెట్టుకోవద్దని, అలాగే ఇప్పటికే ఇరాన్‌లో ఉన్నవారు అందుబాటులో ఉన్న విమాన లేదా ఇతర రవాణా సౌకర్యాల ద్వారా వీలైనంత త్వరగా ఆ దేశాన్ని విడిచిపెట్టి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని భారత ఎంబసీ గట్టిగా నొక్కి చెప్పింది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో ఘర్షణలు రేగినప్పటి

➤ మిగతా 2వ పేజిలో..

## బొగ్గు రంగాన్ని విప్లవాత్మకంగా మార్చాం

### దిగుమతుల తగ్గింపే లక్ష్యం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్ జనసంఘర్షణ :**
భారతదేశాన్ని బొగ్గు ఉత్పత్తిలో స్వయంసమృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఒకప్పుడు అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న బొగ్గు రంగాన్ని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం గత 12 ఏళ్లలో పూర్తిగా రూపాంతరం చెందించిందని పేర్కొన్నారు. గతంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో రూ.1.89 లక్షల కోట్ల భారీ బొగ్గు కుంభకోణం జరిగిందని కాగ్ నివేదిక ఇచ్చిందని, సుప్రీంకోర్టు సైతం అప్పటి కోల్ మైన్స్ కేటాయింపులను రద్దు చేసిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ

➤ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణలో నాలెడ్జ్ విప్లవం

### రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ జనసంఘర్షణ :**
తెలంగాణలో సంక్షేమ రాజ్య స్థాపనే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం విప్లవాత్మక అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ వద్ద రూ.110 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్' స్థలాన్ని, అలాగే కాచిగూడ నింబోలిఅడ్డా వద్ద రూ.25 కోట్లతో పునరుద్ధరించనున్న ఎస్సీ హాస్టల్ ప్రాంగణాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ఈ రెండు భవనాలకు ఇప్పటికే ఆర్థిక, పరిపాలనాపరమైన అనుమతులు లభించాయని తెలిపారు. ఇవి కేవలం భౌతిక కట్టడాలు మాత్రమే కావని, వేలాది మంది నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఆధునిక విజ్ఞాన దేవాలయాలని అభివర్ణించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణను ఉచితంగా అందించి, వారి కోచింగ్ కష్టాలను

➤ మిగతా 2వ పేజిలో..

## కాశీ యాత్రకు వెళ్లిన నెల్లూరు భక్తుల బస్సు బోల్తా

### బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం: .. ముగ్గురు దుర్మరణం

**నెల్లూరు జనసంఘర్షణ :**
నెల్లూరు జిల్లా నుంచి కాశీ పుణ్యక్షేత్ర దర్శనానికి వెళ్లిన భక్తుల బస్సు బీహార్‌లోని ఔరంగాబాద్ వద్ద ఘోర ప్రమాదానికి గురైంది. వేగంగా వచ్చిన ఒక లారీ యాత్రికుల బస్సును బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో నెల్లూరు జిల్లాలోని సంగం, ఆత్మకూరు, దుత్తలూరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 43 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో సంగం గ్రామానికి చెందిన చౌడం హజరత్తయ్య (60), ఆత్మకూరు వీవర్స్ కాలనీకి చెందిన తూమా పద్మావతి (43)లతో పాటు నెల్లూరు మిలటరీ కాలనీ దర్గామిట్ట ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్, ఈ యాత్ర నిర్వాహకుడు పసుపులేటి వెంకటేశ్వర్లు (63) ఉన్నారు. పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లిన తమ వారు

➤ మిగతా 2వ పేజిలో..

## మళ్లీ తగ్గిన పసిడి ధరలు

### స్థిరంగా కొనసాగుతున్న వెండి



**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
గత వారం రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం ధరలు అదే బాటలో పయనిస్తున్నాయి. ఈ వారం మొదటి రోజైన సోమవారం కూడా దేశీయ మార్కెట్లో పసిడి ధరల్లో కోత పడింది. దేశవ్యాప్తంగా మేలిమి బంగారం ధర సగటున రూ.1,000 మేర తగ్గగా, వెండి ధరలు మాత్రం ఎలాంటి మార్పు లేకుండా స్థిరంగా ఉన్నాయి. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ సమాచారం ప్రకారం, సోమవారం ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,040 తగ్గి రూ.1,51,690కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం కూడా రూ.950 మేర క్షీణించి రూ.1,39,050 వద్ద ట్రేడవుతోంది. నగరంలో కిలో వెండి ధర మాత్రం రూ.2.7 లక్షలుగా స్థిరంగా కొనసాగుతోంది. విజయవాడలోనూ ఇవే ధరలు అమలవుతున్నాయి. దేశంలోని ఇతర ప్రధాన నగరాల

➤ మిగతా 2వ పేజిలో..

# మళ్లీ తగ్గిన పసిడి ధరలు

**మొదటిపేజీ తరువాయి..** విషయానికి వస్తే, ముంబైలో కూడా హైదరాబాద్ తరహాలోనే 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,690గా, 22 క్యారెట్ల ధర రూ.1,39,050గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,51,840 వద్ద, 22 క్యారెట్ల ధర రూ.1,39,200 వద్ద కొనసాగుతోంది. ఇక చెన్నైలో 24 క్యారెట్ల బంగారం రూ.1,53,490 పలుకుతుండగా, 22 క్యారెట్ల ధర రూ.1,40,700గా నమోదైంది. దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో కిలో వెండి ధరలు రూ.2.6 లక్షల నుండి రూ.2.7 లక్షల మధ్య స్థిరంగా సాగుతున్నాయి.

## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..** నెలకొన్నాయి. ఈ భయంకర ప్రమాదం వెనుక సాంకేతిక లోపాలు ఉన్నాయా, లేక భద్రతా ప్రమాణాల పర్యవేక్షణలో ఏవైనా లోపాలు జరిగాయా అనే కోణంలో అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఉన్నతాధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. కాగా, ఈ ఉక్కు కర్మాగార ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించిన సీఎం, కార్మికుల మృతి పట్ల తీవ్ర ఆవేదన చెందారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని మరియు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరపాలని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా ఈ ఘటనపై తక్షణమే స్పందించారు. విశాఖ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్‌లతో మాట్లాడి సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. విజయనగరం పర్యటనలో ఉన్న హోంమంత్రి, ప్రమాద వార్త తెలియగానే తన కార్యక్రమాలను రద్దు చేసుకుని హుటాహుటిన విశాఖపట్నం బయలుదేరారు.

# ఇరాన్‌ను తక్షణమే వీడాలి

**మొదటిపేజీ తరువాయి..** నుంచి భారత్ ఇలాంటి ప్రయాణ హెచ్చరికలను జారీ చేయడం ఇది ఎన్నోసారో. యుద్ధ వాతావరణం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు 1600 మందికి పైగా భారతీయులను ప్రభుత్వం ఇరాన్ నుండి సురక్షితంగా తీసుకొచ్చింది. అంతేకాకుండా, ఈ తాజా ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలోని వివిధ దేశాల నుండి దాదాపు 6 లక్షల మంది భారత పౌరులు ఇప్పటికే స్వదేశానికి చేరుకున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది.

మరోవైపు, ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య పోరు మరింత హింసాత్మకంగా మారింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడులకు ప్రతిచర్యగా ఇరాన్ వ్యూహాత్మక దాడులకు దిగింది. దీనికి ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ కూడా అదే స్థాయిలో బదులిచ్చింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు సమీపంలో ఉన్న వ్యూహాత్మక 'మషహర్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్'ను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడింది. ఈ దాడిలో ఆ ప్లాంట్ భారీగా దెబ్బతిన్నట్లు ఇజ్రాయెల్ సైనిక వర్గాలు ధృవీకరించాయి. నైరుతి ఇరాన్ ప్రాంతంలో పెట్రో కెమికల్ ఉత్పత్తుల ఎగుమతులకు ఈ మషహర్ ప్లాంట్ అత్యంత కీలకమైన కేంద్రం కావడం గమనార్హం. ఈ పరిణామాలతో అంతర్జాతీయంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## తెలంగాణ 'ఫర్టిలైజర్ యాప్'పై దేశవ్యాప్త ప్రశంసలు.. అన్ని రాష్ట్రాల్లో అమలుకు కేంద్రం సన్నాహాలు: మంత్రి తుమ్మల

**హైదరాబాద్ :** రైతులకు పారదర్శకంగా, సులభంగా ఎరువులను పంపిణీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన 'ఫర్టిలైజర్ యాప్' దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ డిజిటల్ విధానం ఎరువుల పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే కాకుండా, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ నమూనాను స్ఫూర్తిగా తీసుకుని పొరుగు రాష్ట్రాలు కూడా ఇలాంటి యాప్‌ల రూపకల్పనకు చర్యలు చేపట్టాయని వివరించారు. ఈ క్రమంలోనే కేంద్ర వ్యవసాయ శాఖ సైతం ఈ యాప్ పనితీరును అభినందించిందని, దేశవ్యాప్తంగా ఈ ఎరువుల యాప్‌ను విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని మంత్రి తెలిపారు. ప్రాథమికంగా రెండు జిల్లాల్లో దీనిని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ యాప్‌లో మరిన్ని ఆధునిక సౌకర్యాలను కల్పిస్తున్నామని, ఇకపై రైతులు మీ-సేవా కేంద్రాల ద్వారానే కాకుండా టెలిఫోన్ ద్వారా కూడా తమకు కావలసిన ఎరువులను బుక్ చేసుకునే సదుపాయాన్ని తీసుకువస్తున్నామని చెప్పారు.

రైతుల సహాయార్థం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశామని, ఏ డీలర్ వద్ద ఎంత ఎరువుల స్టాక్ ఉందనే వివరాలను రైతులు తమ మొబైల్ ద్వారానే నేరుగా తెలుసుకోవచ్చని తుమ్మల వివరించారు. దీనివల్ల ఎరువుల కొనుగోలు కోసం దుకాణాల ముందు గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడే ఇబ్బందులు తప్పుతాయని, రైతులకు సమయానుకూలంగా సేవలు అందుతాయని స్పష్టం చేశారు. రానున్న ఖరీఫ్ సీజన్ అవసరాల కోసం తెలంగాణకు 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని, సకాలంలో యూరియా సరఫరా అయ్యేలా చూసేందుకు కేంద్రంతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నామని చెప్పారు. ఎరువుల రవాణాను వేగవంతం చేయడం కోసం ఢిల్లీలో ఒక ప్రత్యేక నోడల్ అధికారిని, అలాగే నౌకాశ్రయాల (పోర్టుల) నుంచి స్టాక్ పంపిణీని పర్యవేక్షించేందుకు మరొక ప్రత్యేక

## కాశీ యాత్రకు వెళ్లిన నెల్లూరు భక్తుల బస్సు బోల్తా

**మొదటిపేజీ తరువాయి..** రోడ్డు ప్రమాదంలో మరణించారనే వార్త తెలియడంతో బాధితుల స్వగ్రామాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గయాలోని అనుగ్రహ నారాయణ మగధ్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న బాధితులంతా క్షేమంగానే ఉన్నారని అధికారులు వెల్లడించారు.

ఈ బస్సు ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ముగ్గురు చనిపోవడం అత్యంత బాధాకరమన్న సీఎం, మృతుల కుటుంబాలకు తన గాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద వివరాలపై ఉన్నతాధికారులతో సమీక్షించిన చంద్రబాబు.. బీహార్ ప్రభుత్వంతో తక్షణమే సంప్రదింపులు జరిపి బాధితులకు అవసరమైన అన్ని రకాల వైద్య సహాయం అందేలా చూడాలని ఆదేశించారు. అలాగే ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన మిగిలిన యాత్రికులను త్వరగా స్వస్థలాలకు చేర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఎం ఆదేశాల మేరకు ఏపీ అధికారులు బీహార్ ఉన్నతాధికారులతో, స్థానిక ప్రభుత్వ యంత్రాంగంతో నిరంతరం మాట్లాడుతున్నారు. మరోవైపు నెల్లూరు జిల్లాకు చెందిన మంత్రులు పి. నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి ఈ ప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపిన మంత్రులు, ప్రమాద వార్త తెలిసిన వెంటనే బీహార్ అధికారులతో మాట్లాడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు.

# తెలంగాణలో నాలెడ్జ్ విప్లవం

**మొదటిపేజీ తరువాయి..** శాశ్వతంగా దూరం చేయడమే ప్రభుత్వ సంకల్పమని ఆయన నొక్కి చెప్పారు. ట్యాంక్ బండ్ వద్ద నిర్మించే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌ను సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్లతో పాటు 10 అంతస్తుల అత్యాధునిక భవనంగా తీర్చిదిద్దనున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు. ఇందులో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, అత్యాధునిక కాన్ఫరెన్స్ హాళ్లు ఉంటాయని, ప్రపంచవ్యాప్త మేధావులతో ఇక్కడ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఇలాంటి నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్ ప్రధాన సెంటర్ నుంచి నిపుణులైన లెక్చరర్లు చెప్పే పాఠాలను రాష్ట్రవ్యాప్త సెంటర్లకు డిజిటల్ సాంకేతికత ద్వారా లైవ్‌లో అనుసంధానం చేస్తామని వెల్లడించారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి విద్యార్థులు కోచింగ్ కోసం హైదరాబాద్ వచ్చి వసతి ఖర్చుల భారాన్ని మోయాల్సిన అవసరం తప్పుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం 2016లోనే దీనికి శంకుస్థాపన చేసినా నిర్లక్ష్యం చేసిందని, తమ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం ఈ ఏడాది బడ్జెట్‌లోనే రూ.50 కోట్లు కేటాయించిందని, పాత నిర్మాణాల తొలగింపునకు రూ.5 కోట్లు విడుదల చేశామని చెప్పారు. ఎక్కడా రాజీ పడకుండా అత్యుత్తమ డిజైన్లతో ఈ భవనాన్ని నిర్మించాలని సంక్షేమ శాఖను ఆదేశించారు.

ఉమ్మడి రాష్ట్ర కాలం నుండి ఎంతోమంది పేద విద్యార్థులను ఉన్నత అధికారులుగా తీర్చిదిద్దిన చారిత్రాత్మక నింబోలిఅడ్డా హాస్టల్‌ను రూ.25 కోట్లతో మూడు అంతస్తుల ఆధునిక భవనంగా పునర్నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఈ హాస్టల్‌కు 'బాబు జగ్జీవన్ రామ్ నాలెడ్జ్ సెంటర్'గా నామకరణం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇక్కడ కూడా విజ్ఞాన వ్యాప్తికి అద్భుతమైన వసతులు కల్పిస్తామన్నారు. ఈ నాలెడ్జ్ సెంటర్ల మరింత సమర్థవంతమైన నిర్వహణకు గానూ మేధావులు, విద్యార్థులు, కుల సంఘాల నాయకులు తమ విలువైన సలహాలను సంక్షేమ శాఖ మంత్రికి అందించవచ్చని కోరారు. ఈ పర్యటనలో మంత్రితో పాటు రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్ మరియు సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తృణమూల్ కాంగ్రెస్‌కు భారీ షాక్: రాజ్యసభ సభ్యత్వానికి సుఖేందు శేఖర్ రాయ్ రాజీనామా

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ అధికార పక్షమైన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, పార్లమెంట్ సభ్యుడు సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన టీఎంసీతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని తెంచుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించారు. పార్టీలో అంతర్గత విభేదాలు, అసంతృప్తులు తీవ్రస్థాయికి చేరిన తరుణంలో, టీఎంసీలో అత్యంత వాక్చాతుర్యం గల సీనియర్ నేతగా గుర్తింపు పొందిన సుఖేందు రాయ్ తప్పుకోవడం రాజకీయ వర్గాల్లో పెద్ద దుమారం రేపుతోంది. పార్టీని వీడుతున్నట్లు తృణమూల్ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి పంపిన లేఖలో ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పార్టీలో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతిని, మహిళలపై జరుగుతున్న అణచివేతను బెంగాల్ ప్రజలు తీవ్రంగా తిరస్కరిస్తున్నారని అందులో పేర్కొన్నారు.

## బొగ్గు రంగాన్ని విప్లవాత్మకంగా మార్చాం

**మొదటిపేజీ తరువాయి..** రంగంలో తీసుకొచ్చిన పారదర్శక విధానాల వల్ల దేశవ్యాప్తంగా సుమారు ఐదు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయని వివరించారు. చైనా తర్వాత ప్రపంచంలోనే అత్యధికంగా బొగ్గును వినియోగిస్తున్న దేశం భారత్ అని, మన దేశ విద్యుత్ ఉత్పత్తిలో 72 శాతం బొగ్గుపైనే ఆధారపడి ఉందని మంత్రి తెలిపారు. గతంలో చైనా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా వంటి దేశాల నుంచి పెద్ద ఎత్తున బొగ్గు దిగుమతి చేసుకునే వాళ్లమని, అయితే దేశీయ ఉత్పత్తి పెరగడంతో ఇప్పుడు దిగుమతులను క్రమంగా తగ్గిస్తున్నామని కిషన్ రెడ్డి చెప్పారు. ఈ ఏడాది దేశం ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మైలురాయిని దాటిందని, ప్రస్తుతం దేశ అవసరాలకు సరిపడేలా 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు (దాదాపు 80 రోజులకు సరిపడా) అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. అలాగే అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్, కోల్ ఆధారిత సింథటిక్ గ్యాస్ తయారీపై అధ్యయనం చేస్తున్నామని, దీనిపై ఈ నెల 11న ప్రైవేట్ సంస్థలతో చర్చించనున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల ఇంధన దిగుమతులపై ప్రభావం పడకుండా ప్రత్యామ్నాయ వనరులను అభివృద్ధి చేస్తున్నామని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినియోగం పూర్తయిన గనులను శాస్త్రీయ పద్ధతుల్లో మూసివేసి అక్కడ పెద్ద ఎత్తున వృక్షారోపణ, పర్యాటక రంగ అభివృద్ధి చేపడుతున్నామని చెప్పారు. ఈ గనులను ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్ది గిన్నిస్ బుక్ రికార్డు సాధించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు.

ఇదే సమయంలో అత్యంత కీలకమైన 'క్రిటికల్ మినరల్స్' (కీలక ఖనిజాలు) లో స్వయంసమృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రచిస్తోందని మంత్రి తెలిపారు. అంతర్జాతీయంగా ఈ ఖనిజాల కోసం తీవ్ర పోటీ నెలకొందని, ఒక పొరుగు దేశం భారత్‌కు వీటి సరఫరాను నిలిపివేసిన నేపథ్యంలో, ప్రధాని మోదీ విదేశీ పర్యటనల ద్వారా వివిధ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని చెప్పారు. ఈ క్రమంలోనే 'క్రిటికల్ మినరల్స్ మిషన్' ప్రయోగానికి రూ.1,500 కోట్లు కేటాయించామని, ఇప్పటికే అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్స్ బ్లాక్స్‌ను దక్కించుకున్నామని వివరించారు. మరోవైపు డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డిఎంఎఫ్) నిధుల విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. గనుల ప్రభావిత గ్రామాల అభివృద్ధి కోసం చట్ట ప్రకారం కేటాయించాల్సిన 2 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు విడుదల చేయడం లేదని, గతంలో సింగరేణి డీఎంఎఫ్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించారని ఆరోపించారు. సింగరేణి కాలరీస్ పూర్తిగా రాష్ట్ర పరిధిలోనే ఉంటుందని స్పష్టం చేసిన ఆయన, కేంద్ర ప్రభుత్వం మాత్రం సింగరేణి ఉద్యోగుల ఆర్థిక భద్రత కోసం బీమా సదుపాయాలు కల్పిస్తూ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రధాని మోదీ గత 12 ఏళ్ల పాలనలో దేశాభివృద్ధి, సామాజిక సంక్షేమ రంగాల్లో అద్భుతమైన పురోగతి సాధించారని, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన కాంగ్రెస్ విమర్శలను ప్రజలు నమ్మరని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# సీఎం రేవంత్ తీరుపై కవిత తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'సమీకృత పాఠశాలల' (ఇంటిగ్రేటెడ్ స్కూల్స్) విధానంపై బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను భారీగా తగ్గించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని ఆమె మండిపడ్డారు. సోమవారం విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 27,000 ప్రభుత్వ పాఠశాలలను కేవలం 4,000 క్లస్టర్లుగా కుదిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉన్న ఈ నిర్ణయం వల్ల పేద విద్యార్థులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. విద్యాశాఖపై ప్రభుత్వానికి కనీస పట్టు లేదని ఈ నిర్ణయాలే స్పష్టం చేస్తున్నాయని విమర్శించారు.

ఇటీవల కాలంలో రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో సుమారు వంద మందికి పైగా విద్యార్థులు మరణించినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీసం ఒక సమీక్షా సమావేశం కూడా నిర్వహించకపోవడం దారుణమని కవిత ఆరోపించారు. విద్యార్థుల ప్రాణాల కంటే పాఠశాలల మూసివేతపైనే ప్రభుత్వానికి ఎక్కువ ఆసక్తి ఉన్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. కాగా, అంతకుముందు బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా సంస్కరణలపై కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలోని 27,000 ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం 18 లక్షల మంది విద్యార్థులు మాత్రమే చదువుతుండగా, 12,000 ప్రైవేట్ స్కూళ్లలో ఏకంగా 35 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతోనే.. నర్సరీ నుండి 12వ తరగతి వరకు ఒకే ప్రాంగణంలో ఉంటూ, ఉచిత రవాణా, భోజన వసతులతో కూడిన అత్యాధునిక 'సమీకృత పాఠశాలలను' పైలట్ ప్రాజెక్ట్ కింద ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే ప్రతిపక్షాల నుండి ఈ ప్రతిపాదనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

# ఇల్లందు బ్రిడ్జి బస్ స్టాప్ సెంటర్‌లో యథేచ్ఛగా చేపల మార్కెట్..

- ట్రాఫిక్‌కు అంతరాయం, ప్రజా ఆరోగ్యానికి ముప్పు.
- ఇల్లందు బుగ్గవాగు బ్రిడ్జి బస్ స్టాప్ సెంటర్‌లో రోడ్డుపైనే చేపల అమ్మకాలు..
- దుర్వాసనతో ప్రయాణికుల నరకం

ఇల్లందు జూన్ 08 (జన సంఘర్షణ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గ కేంద్రంలోని ప్రధాన కూడలి అయిన బుగ్గవాగు బ్రిడ్జి బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన తీవ్రరూపం దాల్చుతోంది. ప్రజా ఆరోగ్యం, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రధాన రహదారిపై చేపల అమ్మకాలు (చేపల మార్కెట్) సాగించకూడదని గతంలో మున్సిపల్ అధికారులు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమాత్రం మారలేదు. ఎల్లప్పుడూ వాహనదారులు, ప్రయాణికులతో అత్యంత రద్దీగా ఉండే బుగ్గవాగు బ్రిడ్జి బస్టాండ్ సెంటర్ వంటి ప్రాంతంలో రోడ్డుపైనే చేపలు విక్రయించడం వల్ల పరిసర ప్రాంతాల్లో తీవ్రమైన దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రయాణించే వాహనదారులు, బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులు ఈ దుర్వాసన భరించలేక ముక్కులు మూసుకుని తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. "ఇక్కడ చేపలు అమ్మకూడదు" అని స్పష్టమైన నిబంధనలు, బోర్డులు ఉన్నప్పటికీ, కొంతమంది వ్యాపారులు వాటిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తూనే ఉన్నారు. రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని, పాదచారులు నడవడానికి కూడా వీల్లేకుండా పోతోందని స్థానిక స్వచ్ఛంద సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిబంధనల ఉల్లంఘనపై







స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, సంబంధిత అధికారులు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అధికారులు కేవలం ఆదేశాలకే పరిమితమై, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను పూర్తిగా వదిలేశారని, వారి అలసత్వం వల్లే వ్యాపారులు నిబంధనలను బేఖాతరు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి బుగ్గవాగు బ్రిడ్జి బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై చేపల అమ్మకాలను తక్షణమే నిలిపివేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఇక్కడి వ్యాపారులను నిర్ణీత మార్కెట్ ప్రాంతానికి తరలించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన జరిమానాలు విధించాలని, తద్వారా ట్రాఫిక్ ఇబ్బందులను, ఆరోగ్య సమస్యలను దూరం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# భద్రాచలం ఏరియా హాస్పిటల్‌లో ఘోరం


- నిద్రమాత్రలు మింగిన మహిళకు దక్కని అత్యవసర వైద్యంరోగి ప్రాణాపాయంలో ఉంటే జోకులు వేసుకున్న నర్సులు, డాక్టర్లు..
- భద్రాచలం ఆసుపత్రిలో అమానుషం నాలుగు రాష్ట్రాల వారధిగా ఉన్న ఆసుపత్రిలో నిర్లక్ష్యం..
- చావు బతుకుల్లో ఉన్నా పట్టించుకోని వైనం
- కడుపు క్లీన్ చేయలేదు.. వాంతులు చేయించలేదు: భద్రాచలం ప్రభుత్వ వైద్యుల బాధ్యతారాహిత్యంభర్త ఎంత బతిలాడినా కరగని మనసులు..
- రౌండ్స్ పేరుతో కాలయాపన చేసిన డ్యూటీ డాక్టర్లు గిరిజనుల పెద్ద దిక్కుకు ఏమైంది?
- భద్రాచలం ఏరియా హాస్పిటల్‌లో మళ్లీ వెల్లువెత్తిన ఆరోపణలుగతంలో శవాన్ని మోసుకెళ్లిన దుస్థితి..
- నేడు ప్రాణాల మీదకు తెచ్చిన నిర్లక్ష్యం..
- ఏరియా ఆసుపత్రిపై ప్రజాగ్రహండ్యూటీ మరిచి ప్రవర్తించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి..
- ఉన్నతాధికారులను డిమాండ్ చేస్తున్న ప్రజలు మహిళకు అందని ఎమర్జెన్సీ ట్రీట్మెంట్..
- కేవలం గ్లూకోజ్ పెట్టి చేతులు దులుపుకున్న వైద్యులు






భద్రాచలం జూన్ 08 (జన సంఘర్షణ)

భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో వైద్యుల, సిబ్బంది నిర్లక్ష్యం మరోసారి బట్టబయలైంది. అత్యవసర స్థితిలో ఉన్న రోగి ప్రాణాలతో కొట్టు మిట్టాడుతున్నా, కనీస మానవత్వం లేకుండా ప్రవర్తించిన తీరుపై స్థానికంగా తీవ్ర కలకలం రేగుతోంది. డ్యూటీలో ఉన్న వైద్యులు, నర్సులు తమ బాధ్యతను మరిచి ప్రవర్తించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవు తున్నాయి. ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. సోమిశెట్టి రత్నకుమారి (31) అనే మహిళ కొన్ని కారణాల వల్ల నిద్రమాత్రలు మింగింది. ఈ విషయం గమనించిన ఆమె భర్త జగదీష్, ప్రాణాపాయ స్థితిలో ఉన్న భార్యను కాపాడుకునేందుకు హుటాహుటిన భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రికి చేరుకున్న వెంటనే భర్త జగదీష్ అక్కడి సిబ్బందిని, వైద్యులను వేడుకున్నారు. తన భార్య నిద్రమాత్రలు మింగిందని, పరిస్థితి చాలా విషమంగా ఉందని, దయచేసి త్వరగా చికిత్స అందించాలని ఎంతో బతిమిలాడారు. అయితే, అక్కడ ఉన్న సిబ్బంది ఎవరూ కూడా ఈ అత్యవసర కేసుపై పూర్తిస్థాయిలో స్పందించకపోవడం గమనార్హం. మరోవైపు, రోగి ప్రాణం మీదికి వస్తుందని భర్త ఎంతగా మొరపెట్టుకున్నా.. తమకు వేరే ఎమర్జెన్సీ కేసు ఉందని సాకులు చెప్తూ కాలయాపన చేశారు. అంతటి తీవ్రమైన పరిస్థితి ఉన్నప్పటికీ, వైద్యులు వేరే కేసుల వైపు వెళ్లడమే కాకుండా, తాము రౌండ్స్‌కు వెళ్తున్నామంటూ బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇచ్చారు. ఈ గందరగోళం మధ్యలో ఒకసారి వచ్చి రత్నకుమారికి కేవలం గ్లూకోజ్ బాటిల్ పెట్టి, ఆ తర్వాత మళ్లీ ఆమెను పట్టించుకోవడం మానేశారు. నిద్రమాత్రలు మింగినప్పుడు తక్షణమే చేయాల్సిన అత్యవసర ప్రాథమిక చికిత్సలైన.. వాంతులు చేయించడం కానీ, కడుపును (స్టమక్ వాష్) శుభ్రం చేయడం కానీ కనీసం చేయలేదు. వైద్యులు, నర్సులు అత్యంత అమానవీయంగా వ్యవహరించడమే కాకుండా.. రోగి చావుబతుకుల్లో ఉంటే కనీస బాధ్యత లేకుండా ప్రవర్తించారు. ట్రీట్‌మెంట్ అందించాల్సిన చోట కూడా వారు ఒకరినొకరు జోకులు వేసుకుంటూ, నవ్వుకుంటూ గడిపినట్లు బాధితుడి భర్త ఆవేదన వ్యక్తం చేశారు. తాము చేస్తున్న డ్యూటీ ఎంత బాధ్యత కలిగినదో వారు మరిచిపోయారని మండిపడ్డారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిపై ఇలాంటి ఆరోపణలు రావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ఈ ఆసుపత్రి నిర్వహణపై, సిబ్బంది ప్రవర్తనపై అనేక ఘోరమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇక్కడ పేదలకు సరైన వైద్యం అందడం లేదనే విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఈ మధ్య కాలంలోనే ఈ ఆసుపత్రిలో ఒకరు చనిపోగా, ఆ మృతదేహాన్ని తరలించడానికి కనీసం అంబులెన్స్ వాహనాన్ని కూడా కేటాయించలేదు. దీంతో మృతుడి బంధువులు వేరే దారి లేక, శవాన్ని ముగ్గురు వ్యక్తులు చేతులపై మోస్తూ ఆసుపత్రి బయటకు తీసుకెళ్లాల్సి వచ్చింది. ఈ ఘోర కలి సామాజిక మాధ్యమాల్లో అప్పట్లో తీవ్ర దుమారం రేపింది. భద్రాచలం ఏరియా ఆసుపత్రి భౌగోళికంగా చాలా కీలకమైనది. ఇది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వంటి నాలుగు రాష్ట్రాల సరిహద్దులకు ఒక ప్రధాన వారధిగా నిలుస్తోంది. నాలుగు రాష్ట్రాల ప్రజలు, ముఖ్యంగా పేదలు అత్యవసర వైద్యం కోసం ఈ ఆసుపత్రిపైనే ఆధారపడుతుంటారు. అంతేకాకుండా, ఈ ప్రాంతంలోని ఎంతో మంది గిరిజనులు, ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు మెరుగైన వైద్యం కోసం కొండలు, కోనలు దాటి భద్రాచలం ఏరియా ఆసుపత్రికే వస్తుంటారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే ఆర్థిక స్తోమత లేని గిరిజనులకు ఈ ప్రభుత్వ ఆసుపత్రే ఏకైక దిక్కు. కానీ, ఇక్కడి వైద్యుల, సిబ్బంది యొక్క ఇటువంటి నిర్లక్ష్యమైన పనితీరు వల్ల నిరుపేద ప్రజలు, గిరిజనులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నమ్ముకుని వచ్చిన పేద ప్రజల ఆరోగ్యంతో ఆసుపత్రి సిబ్బంది ఆటలాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు, వైద్యారోగ్య శాఖ వెంటనే స్పందించి, రత్నకుమారి కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్యూటీ డాక్టర్లు, నర్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆసుపత్రి వ్యవస్థను ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.




# అన్నదాత ఆత్మగానం



- మంజుల పత్తిపాటి

కష్టాల కడలిలో కరిగే రైతన్న..! కన్నీటి కాలువలో కలిసే రైతన్న..!
కొనుగోలు కేంద్రాల్లో కాచే నిరీక్షణ..!కడగండ్ల వానలకు చెదిరే ఆకాంక్షణ..!
రైతే రాజు అన్నారు రైతన్నా..!గిట్టుబాటు ధరను నిర్ణయించలేని స్థితిలో నీవెన్నన్నా..!
పచ్చని పొలాల వెనుక నీ త్యాగ గాథను ఎవరు గమనించారు..?
ప్రతి గింజలో దాగిన నీ జీవన వ్యథను ఎవరు విన్నారు..?
దేశానికి వెన్నెముకవైన రైతన్నా..!
నీ చిరునవ్వు పూసే ఆ రోజుకైఎదురుచూస్తున్న కాలమన్నా ..!

**రచన: మంజుల పత్తిపాటిమాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ రాష్ట్రం చరవాణి 9347042218**

## ఈనెల 10న మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి సిద్దాపూర్‌కు రాకసభా స్థలాన్ని పరిశీలించిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

వర్ని/జూన్ 8/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లావర్ని మండలం, బాన్సువాడ నియోజకవర్గంఈనెల 10 వ తేదీ బుధవారం 106 కోట్లతో నిర్మించిన జాకోర, చందూర్ ఎత్తిపోతల పథకాల ప్రారంభోత్సవం, సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి రాష్ట్ర బారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విచ్చేస్తున్న నేపథ్యంలో ఈరోజు ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస రెడ్డి , రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు . హెలిప్యాడ్ స్థలం, సభా ప్రాంగణంను పరిశీలించిన పోచారం వెంట ఉన్న వర్ని చందూర్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు. పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను అప్పజెప్పడానికి హక్కు ఎక్కడిది

- వర్నిలోని ఓ వ్యక్తికి ప్రభుత్వ భూమి అప్పజెప్పడం ఏమిటి......
- ఆయనకు సంతకాలు చేయడంలో ఐదుగురి ప్రేక్షక పాత్ర ఏమిటి
- ఎంత మాములు తీసుకున్నారు
- ఎందుకు అక్బర్ నగర్ ప్రభుత్వ భూములు ఆయనకు అప్పజెప్తారు
- గ్రామంలో పేదలు లేరా..?

అక్బర్ నగర్ /జూన్ 8/(జన సంఘర్షణ)




రుద్రూర్ నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండలం అక్బర్ నగర్ గ్రామంలో 246,247 ఇతర సర్వేనెంబర్‌లో సుమారు ప్రభుత్వ భూమి అనేకం ఉందని, ఈ భూములలో సుమారు 5 ఎకరాలు వర్ని గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి భూములు అప్పజెప్పడంలో, గ్రామంలోని అయిదుగురు ప్రేక్షక పాత్ర వహించి సంతకాలు పెట్టడం ఏమిటి, ఆ ఐదుగురు ఎన్ని డబ్బులు తీసుకున్నారు, ఎందుకు సంతకాలు పెట్టారు, అని గత రెండు రోజుల క్రితం గ్రామంలో జరిగిన ఓ గ్రామ సభలో గ్రామస్తులు నిలదీయగా గ్రామ సీనియర్ సామాజిక కార్యకర్త అదేవిధంగా నాయకులు తిగుళ్ల రాజా వర ప్రసాద్ ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాంబాబుతో పాటు పలువురి నిలదీయడం జరిగింది. గ్రామంలోని నిరుపేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూములు పేదలకు చెందాలంటూ దళితులు ప్రశ్నించడానికి పోతే వారిపై సుమారు ఎనిమిది నుంచి పదిమందిపై అక్రమ కేసులు పెట్టడం ఏమిటని గ్రామ సర్పంచి తోపాటు అదేవిధంగా సంతకాలు పెట్టిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్ణికి చెందిన వ్యక్తి గ్రామంలో 5 క్రమ భూమి కబ్జా చేస్తుంటే చూస్తూ ఎలా ఊరుకుంటారు అని ప్రభుత్వ భూమి ఆయనకు ఎలా అప్ప చెప్తారని ఈ విషయానికి ఒప్పుకోమని అడ్డుకుంటామని, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడిది లేదని జైలుకు పోవడానికి సిద్ధం కానీ గ్రామ ప్రభుత్వ భూములు కాపాడమే కాకుండా పేదలకు ఇచ్చేంతవరకు తమ పోరాటాలు ఆపబోమని గ్రామస్తులు హెచ్చరికలు చేయడం జరిగింది. ఈ విషయంలో గ్రామసభలో సుమారు చాలా సేపటి వరకు నిలదీతల వర్షం వాదోపవాదాలు, వాద్వివాద వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## విజయలక్ష్మి నగర్‌లో 'ప్రత్యేక గ్రామసభ' విజయవంతం

- సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు

ఇల్లందు జూన్ 08 (జన సంఘర్షణ)




తెలంగాణ రాష్ట్ర 99 రోజుల ప్రణాళికలో భాగంగా విజయలక్ష్మి నగర్ గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామసభను అత్యంత విజయవంతంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో.. రాబోయే వర్షాకాల సన్నద్ధత, ఘనవ్యర్థాల నిర్వహణ, 'ఎస్‌డబ్ల్యుఎం 2026' కొత్త నిబంధనలపై ప్రజలకు సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ సందీప్, మిషన్ భగీరథ ఏఈ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, వార్డు సభ్యులు, ఇతర అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామసభలో సర్పంచ్ రమేష్ బాబు మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా చెత్తను నాలుగు రకాలుగా విభజించాలన్నారు. వంటింటి వ్యర్థాలను తడి చెత్తగా, కాగితాలు-ప్లాస్టిక్-గాజులను పొడి చెత్తగా, డైపర్లు-నాప్కిన్లను శానిటరీ వ్యర్థాలుగా, మరియు బల్బులు-బ్యాటరీలు-మందులను ప్రత్యేక వ్యర్థాలుగా వేరు చేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు మాత్రమే అందించాలని స్పష్టం చేశారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే గ్రామపంచాయతీ నిబంధనల ప్రకారం కఠినమైన జరిమానాలు విధిస్తామని సర్పంచ్ హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య రక్షణకై కాచి వడపోసిన నీటినే తాగాలని సూచించారు. అలాగే, త్వరలోనే పంచాయతీ ఆధ్వర్యంలో పంపిణీ చేయబోయే మొక్కలను ఇంటి పరిసరాల్లో నాటి, పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. చివరగా, గ్రామసభకు విచ్చేసి తమ అమూల్యమైన సలహాలు, సూచనలతో సభను విజయవంతం చేసిన అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలందరికీ ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
మంగళవారం
09 జూన్ 2026

# ప్రజా భూ సమస్యలు పరిష్కరించడంలో విఫలమవుతున్న పాలకులు

- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నేత గౌని






భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దుమ్ముగూడెం మండలం, జూన్ 08(జనసంఘర్షణ):

దుమ్ముగూడెం మండలం లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని ప్రజలకు ఇచ్చిన హామీలను పరిష్కరించడంలో ఈ ప్రభుత్వాలు విఫలమైనయని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. దుమ్ముగూడెం మండలంలో పార్టీ సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్య వ్యక్తిగా పాల్గొని ప్రసంగిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలు పట్టించుకోవడంలేదని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పేద మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎన్నికలలో ఇచ్చిన హామీలను కూడా ఈ పాలకులు అమలు చేయడం లేదని వారు అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగ భృతితో ఆశ చూపుతూ ఉద్యోగాల ప్రక్కన నిలిపివేశారని వారు అన్నారు, ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్నటువంటి చట్టాలకు తూట్లు పొడుస్తూ భూస్వాములకు కొమ్ముకాస్తున్నారని ఆయన అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పకడ్బందీగా చట్టాలని అమలు చేయాలని ఆర్ ఎఫ్ ఆర్ పట్టాలున్న భూములకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, పోడు భూముల పేరుతో ఫారెస్టులు భూములను గుంజుకోవడానికి నిలిపివేయాలని వారు అన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ ముసలి సతీష్ మాట్లాడుతూ.. భద్రాచలం డివిజన్ దుమ్ముగూడెం పూర్తిగా వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతమని ఇక్కడ ఆదివాసులను అణిచివేస్తూ భూస్వాములు, పెట్టుబడుదారులు పెత్తనం కొనసాగిస్తున్నారని తక్కువ కూలితో పనులు చేయించుకుంటున్నారని, తక్కువ రేట్లకు భూములు కొనుక్కొని పెత్తనాలు చలాయిస్తూ ఆదివాసీలను పక్కదో పట్టిస్తున్నారని వారు అన్నారు. పోటీ చేసుకొని పోడు భూములు సాగు చేసుకుంటున్న భూముల జోలికి ఫారెస్ట్ వారు అధికారులు రావద్దని వాళ్ల పొట్టకూటి కోసం మాత్రమే పంటలు పండించుకుంటున్నారని, భూస్వాములు చేతిలో వందలాది ఎకరాల భూములు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా కుంజ జోగారావు జెండావిష్కరణ చేయగా డివిజన్ నాయకులు కామ్రేడ్ సూర్యకాంతం అమరవీరుల సంతాపం ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు కోటా నాగమణి,పాయం రాజమ్మ, మడకం సమ్మక్క, మట్ట నరసింహారావు, రాజేశ్వరి, ముత్యాలరావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి హైస్కూల్ సమస్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సానుకూల స్పందన

- విశాల్ పాసి వినతితో కదలిక


प्रशांत पांढरे
Prashant Pandhre

अतिरिक्त निजी सचिव
खान एवं कोयला मंत्री
भारत सरकार
Additional Private Secretary to Minister of Mines & Coal Government of India

Ref#MoCoal&Mines/Gen/Hyd/RV/2026/11800

Date: 06/06/2026

To
The Chairman & Managing Director,
Singareni Collieries Company Limited (SCCL),
Hyderabad,
Telangana.

Subject: Improvement of Mid-Day Meal Facilities, Enhancement of English Medium Education, and Installation of Safety Sign Boards near Singareni High School, Yellandu – Forwarding of representation for taking necessary action – Reg.

Sir/Madam,

The Office of the Hon'ble Minister of Coal & Mines, Government of India, Shri G. Kishan Reddy, Hyderabad, is in receipt of a representation from Shri Vishal Pasi on behalf of the National Forum for People's Empowerment and Social Gesture regarding the welfare and safety of students studying at Singareni High School, Yellandu, which is being run under the management of SCCL. In his representation, he has requested improvement in the quality of Mid-Day Meals and strengthening of English Medium education, as many



ఇల్లందు జూన్ 08 (జన సంఘర్షణ)

ఇల్లందు పట్టణంలోని సింగరేణి హైస్కూల్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం నుండి సానుకూల స్పందన లభించింది. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ (ఇంగ్లీష్ మీడియం) విద్యను అందించడం, అలాగే విద్యార్థుల భద్రత కోసం రోడ్డు రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి కార్యాలయానికి వినతిపత్రం అందింది. నేషనల్ ఫోరమ్ ప్రతినిధి విశాల్ పాసి ఈ పాఠశాల సమస్యలను వివరిస్తూ కేంద్రమంత్రికి లేఖ సమర్పించారు. విద్యార్థుల భవిష్యత్తు, వారి రక్షణకు సంబంధించిన ఈ అంశాలపై కేంద్రమంత్రి కార్యాలయం తక్షణమే స్పందించింది. ఇల్లందు సింగరేణి పాఠశాలలో ఉన్న లోపాలను వీలైనంత త్వరగా నివారించాల్సిన అవసరం ఉందని కేంద్రం అభిప్రాయపడింది. విశాల్ పాసి అందజేసిన ఈ వినతిపత్రంపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం.. పాఠశాలలో వసతుల మెరుగుదలకు, నాణ్యమైన విద్యకు, రోడ్డు రక్షణ చర్యల కల్పనపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ సీఎండీ ని ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో సింగరేణి హైస్కూల్ సమస్యలు త్వరలోనే పరిష్కారం కానున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 15వ వార్డులో ఘనంగా 'పట్టణ ప్రగతి' వార్డు సభ





- సంక్షేమ పథకాల పంపిణీ

ఇల్లందు జూన్ 07 (జన సంఘర్షణ)

స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో పట్టణ ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సోమవారం వార్డు సభను అత్యంత ఘనంగా నిర్వహించారు. గౌరవ శాసనసభ్యులు కోరం కనకయ్య ఆదేశాలు, మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ డానియల్ మిత్ర ఆశీస్సులతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. వార్డు ప్రజల భాగస్వామ్యంతో స్థానిక సమస్యల పరిష్కారం, వార్డు సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా ఈ సభ సాగింది.వార్డు అభివృద్ధి ప్రణాళికలపై విస్తృత చర్చఈ సభలో వార్డు ప్రగతికి సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా రాబోయే వర్షాకాల సన్నద్ధత, తాగునీటి సరఫరా మెరుగుపరచడం, ఘన వ్యర్థాల నిర్వహణ (చెత్త సేకరణ), జల సంరక్షణ, వనరుల రక్షణ, విస్తృతంగా మొక్కల పెంపకం చేపట్టడం, సమగ్ర వనరుల నిర్వహణ లాంటి ముఖ్యాంశాలపై వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.పింఛన్ల పంపిణీ, ప్రముఖుల గుర్తింపుఈ కార్యక్రమానికి 15వ వార్డు కౌన్సిలర్ సోని సుదర్శన్ అధ్యక్షత వహించగా శ్రీనివాస్ రావు, వార్డ్ ఆఫీసర్ లావణ్య, మాజీ కౌన్సిలర్ సుదర్శన్, నాగయ్య, డ్వాక్రా గ్రూప్ అధికారులు, లీలా చంద్రమ్మ, సోనమ్ తివారి, అంగన్‌వాడీ టీచర్ అక్కిరాజు శారద, యూత్ కాంగ్రెస్ సుమిత్ కోరి, చిన్ను లోద్, భాస్కర్, కళ్యాణ్ లోద్, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ సభలో మొత్తం 23 మంది లబ్ధిదారులకు వృద్ధాప్య, ఒంటరి మహిళ, వితంతు పింఛన్లను అందజేశారు. ఈ మేరకు వార్డు కౌన్సిలర్ సోని సుదర్శన్ సంతకంతో కూడిన నివేదికను సమర్పించారు.

# అప్పాయిగూడెం రైతు వేదికలో ప్రత్యేక గ్రామ సభ



ఈ రోజు అప్పాయిగూడెం గ్రామ పంచాయతీలో ' ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల' కార్యక్రమంలో భాగంగా అప్పాయిగూడెం రైతు వేదిక లో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించటం జరిగింది..ఈ కార్యక్రమంలో ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, సర్పంచ్ దండు ప్రవీణ్, కార్యదర్శి కృష్ణవేణి, ఉప సర్పంచ్ ఎట్టి సంధ్య రాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నరేందర్, ఇరిగేషన్ ఏఈ నాగి రెడ్డి, ఇరిగేషన్ ఇన్స్పెక్టర్, అగ్రికల్చర్ ఏఓ బట్టు అశోక్ కుమార్, ఏఈఓ మున్నీ, ఐకేపీ ఏకెఎం వెంకటేశ్వర్లు, సీసీ, డాక్టర్ హిమ బిందు, హెల్త్ డిపార్ట్మెంట్, అంగన్వాడీ టీచర్స్, వార్డ్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్: డ్రైనేజీలో జింక మృతదేహం

నిజామాబాద్/జూన్ 8/(జన సంఘర్షణ)



నిజామాబాద్లోని లలిత మహల్ థియేటర్ సమీపంలో డ్రైనేజీలో ఓ జింక మృతదేహం సోమవారం లభ్యమైంది.డ్రైనేజీలో జింక మృతదేహాన్ని గమనించిన కాలనీవాసులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని జింక మృతదేహాన్ని పరిశీలించారు. నగరంలో డ్రైనేజీలోకి జింక మృతదేహం ఎలా చేరిందనేది ప్రశ్నార్థకంగా మారింది.

# ఇల్లందు 14వ వార్డులో ఘనంగా వార్డు సభ

- ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర.
- కౌన్సిలర్ నీరుడు ఉపేంద్ర శివలాల్ ఆధ్వర్యంలో ఇల్లందులో ముమ్మరంగా సాగిన 14వ వార్డు సభ


ఇల్లందు జూన్ 08 (జన సంఘర్షణ)



నీరుడు ఉపేంద్ర శివలాల్ ఆధ్వర్యంలో ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో వార్డు సభ ఘనంగా నిర్వహించబడింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డేనియల్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి వార్డు సభలు కీలక వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.అనంతరం 14వ వార్డు కౌన్సిలర్ నీరుడు ఉపేంద్ర శివలాల్ మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధి కోసం ప్రజల సూచనలను, అవసరాలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, వీధి దీపాల సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు సమర్పించగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రేఖ స్వరూప రవిశంకర్, సీహెచ్ భారతి శ్రీనివాస్, కో-ఆప్షన్ సభ్యురాలు ఎస్.కే. హసీనా, పట్టణ మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు గాలిపల్లి స్వరూప, కాంగ్రెస్ నాయకులు వాసుదేవ్, వెంకటనారాయణ, చంచలమ్మలతో పాటు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.

# ఇల్లందు ఎమ్మెల్యే చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

ఇల్లందు జూన్ 08 (జన సంఘర్షణ)



నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్ ) ఒక వరమని ఇల్లందు కోరం కనకయ్య పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధప´డుతూ వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్న బాధితులకు ఈ నిధి ఎంతో ఆసరాగా నిలుస్తోందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా, కోయ గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని బావోజీ తండా గ్రామానికి చెందిన భూక్యా నాగేశ్వరావుకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే కోరం కనకయ్య గారు తన చేతుల మీదుగా లబ్ధిదారునికి అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ గారు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్ గారితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు మరియు లబ్ధిదారుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఉగ్ర నరసింహుని అవతారంలో వేణుగోపాలుడు

కార్వేటి నగరం జూన్ 8 (జన సంఘర్షణ)

కార్వేటి నగరంలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం ఉదయం ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ మేల్కొల్పి శుద్ధి తోమాల సేవ మొదటి గంట, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు రారాజైన మృగరాజుపై భక్తవత్సలు డైన వేణుగోపాలస్వామి ఉగ్ర నరసింహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల భాగంగా మూడవ రోజైన సోమవారం స్వామి వారు సింహ వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో విహరించారు. స్వామివారు సింహవాహనపై సేవలో కనులు పండుగ సాగింది మహిళలు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించి ముక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ శ్రీనివాసులు రెడ్డి ఆలయ అధికారిగా చంగల్ రాయులు, నాగరాజు, ప్రధాన అర్చకులు గోపాల ఆచార్యులు శబరినాథ్ చక్రవర్తి, వివిధ ఆలయానికి చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

## ఊటీ టీ హౌస్ నందు ఘనంగా వైయస్సార్ పార్టీ యూత్ అధ్యక్షుడు గజేంద్రకి జన్మదిన వేడుకలు

బంగారుపాళ్యం జూన్ 8. (జన సంఘర్షణ)



చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెం మండలం కేంద్రంలోని మండల యువత అధ్యక్షుడు మొగిలి గజేంద్ర జన్మదిన వేడుకలు బంగారుపాళ్యం ఊటీ టీ హౌస్ నందు మండలంలోని యువత అభిమానుల మధ్య సోమవారం సాయంత్రం 7:30 గంటలకు బారీ కేక్ కట్ చేసి గజేంద్ర కు దుశ్యాలవతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శి కిషోర్ కుమార్ రెడ్డి, మాజీ జిల్లా యువత ఉపాధ్యక్షులు కొత్తపల్లి మహేంద్ర, మండల విప్ హేమచంద్ర, తగ్గువారిపల్లి జగదీష్, కార్తీక్, లిఖిత్, శరత్, దీక్షిత్, జెస్సు, మొగిలి చరణ్, గిరీష్, మోహన్, గగన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు




పోతంగల్/జూన్ 8/ (జన సంఘర్షణ)
పోతంగల్ గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, పారిశుధ్య చర్యలు, డ్రైనేజీ నిర్వహణ, తాగునీటి ఏర్పాట్లు తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించుటకు ఒక ప్రత్యేక గ్రామ సభను ఏర్పాటు చేయడం జరిగింది. వేదిక: గ్రామ పంచాయతీ కార్యాలయం. కావున హాజరై సహకరించవలసిందిగా కోరడమైనది. ఈ కార్యక్రమం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రత్యేక గ్రామ సభ స్పెషల్ ఆఫీసర్ ఎంఈఓ సాయిలు ఆధ్వర్యంలో జరిగింది. ఆశా వర్కర్స్, గ్రామ సభలో సర్పంచ్ సంధ్య, వార్డ్ నెంబర్లు, మాజీ సర్పంచులు, విట్టల్ వైయిద్, లక్ష్మణ్ సార్ తదితరులు పాల్గొన్నారు.

## 12 ఇండ్లు ధ్వంసం కావడం జరిగింది

- ఎన్నారై కోనేరు శశాంక్ కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 12 ఆర్థిక సాయం అందజేత







ఎత్తోండ/జూన్ 8/(జన సంఘర్షణ)
కోటగిరి మండలం ఎత్తోండ క్యాంప్ గ్రామంలో విపరీతమైన ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడం వల్ల 12 ఇండ్లు ధ్వంసం కావడం జరిగింది. గ్రామ ప్రజల ద్వారా, విషయం తెలుసుకున్న ఎన్నారై కోనేరు శశాంక్ కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 12 కుటుంబాలకు వారం రోజులకు సరిపడా నిత్యవసర వస్తువులను ట్రస్ట్ బృందం ద్వారా వారికి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ బృందం ఏముల నవీన్, నాగేల్లి శ్రీనివాస్, వడ్ల శ్యామ్, మామిడి సాయిలు, విలాస్, శ్యామ్, ఆలపాటి హరికృష్ణ గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## సుద్దులం తండాలో ప్రత్యేక గ్రామ సభ

కోటగిరి/జున్8/(జన సంఘర్షణ)




ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా కోటగిరి మండలం సుద్దులం తండాలోని గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఇందులో భాగంగా రానున్న వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, తహశీల్దార్ గంగాధర్, ఎంపీడీవో విష్ణు, ఏఈపీఆర్ నవదీష్ గౌడ్, అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్, ఉప సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సర్వేపల్లిలో నిరంతర ప్రక్రియగా సీఎంఆర్ఎఫ్ సాయం

- నెల్లూరు వేదాయపాళెంలోని కార్యాలయంలో సోమవారం 36 మందికి రూ.33.97 లక్షల విలువైన చెక్కులు అందించిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిమనుబోలు.





8.6.2026 (జన సంఘర్షణ)
రెండేళ్లలో ఇప్పటి వరకు 829 మందికి రూ.7.75 కోట్లు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం మంజూరైనట్లు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డిచంద్ర మోహన్ రెడ్డి చెప్పారు పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరంగా మారింది. ఎన్ని దరఖాస్తులు పంపినా ఉదారంగా సాయం మంజూరు చేస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో సీఎంఆర్ఎఫ్ ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మనుబోలు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పొన్నూరు రామకృష్ణయ్య జిల్లా కార్యదర్శి నూనె లక్ష్మయ్య. సర్వేపల్లి తెలుగు యువత అధ్యక్షులు శివుడు , రాజా, గీత కార్మికుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

## “సర్” పై తెదేపా ఏజెంట్లకు శిక్షణ

- ఎన్నికల్లో బూత్ లెవెల్ ఏజెంట్లదే కీలకపాత్ర
- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

చిత్తూరు జూన్ 8, (జన సంఘర్షణ)
ఎన్నికల్లో బూత్ లెవెల్ ఏజెంట్లదే కీలక పాత్ర అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు.ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సర్ ( ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) కార్యక్రమంపై సోమవారం చిత్తూరు సంతపేటలోని జీజేఎం సుఖీభవ కళ్యాణ మండపంలో చిత్తూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లకు, డివిజన్, గ్రామ కమిటీ అధ్యక్షులకు, యూనిట్, క్లస్టర్ ఇంచార్జ్ లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగుదేశం పార్టీ రూపొందించిన బిఎల్ఏ ల బుక్ లెట్ ను ఏజెంట్లకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో అభ్యర్థులకు విజయంలో ఏజెంట్లదే కీలక పాత్ర అని చెప్పారు. బూత్ స్థాయిలో దొంగ ఓట్లను సమర్థవంతంగా అడ్డుకోవడం, మన పార్టీ సానుభూతిపరుల ఓట్లు అన్ని పోలయ్యేలా చూసుకోవడం ఏజెంట్ల బాధ్యత అన్నారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్నేత్రస్థాయిలో నిర్వహిస్తున్న సర్ సర్వేలో పోలింగ్ బూత్ పరిధిలో దొంగ ఓట్లను తొలగించే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇదే సమయంలో పార్టీ సానుభూతిపరులు ఓట్లు నష్టపోకుండా చూడాలన్నారు. సర్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో డివిజన్, యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్చార్జులు ఎంతో కీలకంగా పని చేయాలని.. ఓటర్ల జాబితా విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

**ఎన్ని అడ్డంకులు వచ్చినా రోడ్ల విస్తరణ ఆపను..**

నగరంలో జరుగుతున్న రోడ్ల విస్తరణ అభివృద్ధి పనుల విషయంలో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, జిల్లాలోనే కాక బయట ప్రాంతాల్లోని వారు సైతం చిత్తూరులో జరుగుతున్న రోడ్ల అభివృద్ధిపై సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. మరో రెండు వారాల్లో హైరోడ్ విస్తరణ పనులు ప్రారంభిస్తామన్నారు. పలమనేరు రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేస్తామని, నగరంలో అన్ని రోడ్లను విస్తరించి అభివృద్ధి చేయడమే తన ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ విషయంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఇబ్బందులు సృష్టించినా ముందుకే వెళ్తానన్నారు. ఇప్పటికే అభివృద్ధి చేసిన చాలా రోడ్లలో స్థానిక ప్రజల సహకారం మరువలేనిదని, ఇదే తరహాలో ప్రజలకు నచ్చజెప్పి, ఒప్పించి రోడ్ల విస్తరణ చేపడతానన్నారు. చిత్తూరులో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రతి ఒక్కరు ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా సర్ ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర,మార్గదర్శకాలు, అధికారులతో సమన్వయం, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై శిక్షణఇచ్చారు. ఈకార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు షణ్ముగం రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు పురిమిట్ల కుమారి, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు,మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, సురేంద్ర కుమార్, కాజూరు బాలాజీ, మోహన్ రాజ్, రాజేష్ కుమార్ రెడ్డి, ఆముద, నరేష్ తదితరులు పాల్గొన్నారు.






## గవర్నర్ పర్యటన విజయవంతం చేయండి..

- జాయింట్ కలక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి

మనుబోలు. 8.6.2026 (జన సంఘర్షణ)
ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్మ మంగళవారం పర్యటనను విజయవంతం అయ్యేలా జిల్లా అధికారులకు తమకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వహించాలి.. జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు.ఎప్పటినుంచో పెండింగ్లో ఉన్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు సంబంధిత మండల అధికారులు తీసుకోవాలి.... జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వరు ,,జిల్లా అధికారులు ఈ పి టి ఎఫ్ డాక్యుమెంట్లు అప్లోడ్, టపి.జి ఆర్ఎస్ అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి.... జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు– సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అర్జీలను జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ ,తెలుగు గంగ ప్రత్యేక అధికారి మహేశ్వర రెడ్డి, మెప్మా పి.డి.కిరణ్ కుమార్,ఐటిడిఏ పిఓ శ్రీనివాసరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగ శేఖర్ తదితరులు అర్జీ దారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రేపు జిల్లాలో పర్యటించిన రాష్ట్ర గవర్నర్ ఎస్ .అబ్దుల్ నజీర్ పర్యటనను సంబంధిత అధికారులు విజయవంతం అయ్యేలా తమకు కేటాయించిన విధులను జాగరుకతతో నిర్వహించి గవర్నర్ పర్యటన విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా అధికారులు ఆయా శాఖలకు సంబంధించి పి జి ఆర్ ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను పరిష్కారం అయ్యేలా చూడాలని సదరు విషయాలను సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలని ఆయన సూచించారు. అధికారులు ఈ పి టి ఎస్, పి జి ఆర్ ఎస్ లో అర్జీలను త్వరితగతిన పరిష్కరింపచేయాలన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు అవసరమైన మౌలిక వసతులతో పాటు ప్రత్యేక క్యూ లైన్ ను ఏర్పాటు చేయడంతో పాటు చలువ పందిళ్లను ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే ఉచిత భోజన సదుపాయాన్ని అందించారు. రెవిన్యూ సంబంధిత విషయాలను పరిష్కరించే విధంగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడం తో పాటు ప్రాథమిక వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది.



## ఎరువుల దుకాణం తనిఖీ



నంద్యాల (జన సంఘర్షణ) జూన్ 8...
ఉప వ్యవసాయ సంచాలకులు శ్రీ గంగాధర్ రావు గారు, నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు తో కలిసి నంద్యాల మండలం యందలి పలు ఎరువుల దుకాణాలు తనిఖీ చేసి డి. ఎ. పి, యూరియా పంపిణీ ప్రక్రియను పరిశీలించారు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా వ్యవసాయ ఉప సంచాలకులు గంగాధర్ రావు పలు దుకాణాల యందు స్టాక్ రిజిస్టర్, రశీదులు, పలు ధ్రువపత్రాల, స్టాక్ నిల్వలు తనిఖీ చేయడం జరిగింది. అదేవిధంగా యూరియా, డి. ఎ. పి ఎరువులను అమ్మాలని యూరియా విక్రయించే ప్రక్రియను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ ఉప సంచాలకులు గంగాధర్ మాట్లాడుతూ.. రైతులకు ఈ ఖరీఫ్ సీజన్ నుండి యూరియా, డి.ఏ.పీ ఎరువులను పంపిణి చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ ఆప్ నందు గత ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటల వివరాలు రైతు వారిగా పొందుపరచడం జరిగిందని, అలాగే మండలం లోని ఎరువుల డీలర్లను అనుసందానించడం జరిగిందని, ఏ పంటకు ఎంత మోతాదులో నత్రజని, భాస్వరం వాడాలో దానికి అనుగుణంగా ఎన్ని బస్తాల యూరియా, డి.ఏ.పీ అవసరమో సూచించడం జరిగిందని అందుకు అనుగుణంగానే ఎరువులు డి ఎ పి, యూరియా సరఫరా చేయబడునని కావున మీ యొక్క గ్రామాలలోని రైతు సేవా సిబ్బందిని కలిసి మీ సమాచారం చూసుకోవాల్సిందిగా కోరడమైనది. అదే విధంగా డీలర్లు అందరూ ధరకే ఎరువులు విక్రయించాలని పాత స్టాక్ పాత ఎం.ఆర్.పి ధరకే విక్రయించాలని, ప్రతీ రోజు స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డు అప్డేట్ చెయ్యాలని, ఎరువులు పురుగుమందులు కొన్న ప్రతి రైతు కి బిల్లు కచ్చితంగా ఇవ్వాలని తెలియజేశారు.

# మామిడి రైతుల సమస్యలపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం

- క్రిష్ణగిరి మామిడి పంటకు ఎలాంటి ధర ఇస్తున్నారు అదే ధర చిత్తూరు జిల్లా రైతులకు అందిస్తాం
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, జూన్8 జనసంఘర్షణ:** క్రిష్ణగిరి నందు మామిడి పంటకు ఎలాంటి ధరఅందజేస్తున్నారు ఉద్యానవన, మార్కెటింగ్ టీం బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించాలి అనిజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు, సోమవారం స్థానిక కలెక్టరేట్లోనే సమావేశ మందిరంలో ఉద్యానవన శాఖఅధికారులతోమార్కెటింగ్ శాఖ అధికారులతోతోతాపురి మామిడికి గిట్టు బాటు ధర అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూరైతుల నుంచి వచ్చిన వినతులు, సంఘాల డిమాండ్లు, ప్రజాప్రతినిధుల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుని సాధ్యమైన పరిష్కార మార్గాలను అన్వేషించాలని అధికారులను ఆదేశించారు జిల్లాలో 31 జ్యూస్ ఫ్యాక్టరీలో ఉండగా అందులో 28 ఫ్యాక్టరీలు పని చేస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఉన్న గుజ్జు పరిశ్రమల్లో కేవలం 14 ఫ్యాక్టరీలు మాత్రమే తోతాపురి మామిడి కొనుగోళ్లు చేపడుతున్నాయి. మిగిలిన పరిశ్రమలు కొనుగోళ్లకు ముందుకు వచ్చే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి గుజ్జు పరిశ్రమ వద్ద రైతులకు కిలోకు రూ. ధర పట్టిక ప్రదర్శించాలని ఆదేశించారు, ప్రతిరోజు ఎంత ధర రైతులకు చెల్లిస్తున్నారు నివేదికల రూపంలో నాకు అందజేయాలని ఆదేశించారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో సమావేశమై రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఫ్యాక్టరీల వద్దకు వచ్చే ట్రాక్టర్లు, లారీలను వచ్చిన క్రమంలో పంపుతున్నారని, లేదా పరిశీలించాలన్నారు, ఫ్యాక్టరీలపై మరింత నిఘా ఉండే విధంగా సంబంధిత ఎమ్మార్వోలకి ఆదేశాలు జారీ చేయుచున్నామని తెలిపారు, రేపటినుండి ఉద్యానవన శాఖ అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులు ఫ్యాక్టరీలలో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని రైతులకు ఎలాంటి సమస్య రాకూడదని ఆదేశించారు. రైతులు నేరుగా ఫ్యాక్టరీలకు సరఫరా చేస్తే ప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుందని,ర్యాంపుల దగ్గర అధికారుల పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది తెలిపారు. మామిడి పంట పండించిన రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోయి సమస్యను పరిష్కరించడానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అధికార యంత్రాంగం కృష్ణ గిరిలో మామిడి పంటకు ఎలాంటి ధర చెల్లిస్తున్నారు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ డిడి సతీష్, కోటేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ అధికారి పరమేశ్వరన్, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.



# పయ్యావుల కేశవ్ మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నంద్యాల నాయకులు చందు, సుందర్, రాంబాబు

**నంద్యాల, జూన్ 8 జనసంఘర్షణ** మండలం చాపరేవుల గ్రామంలోనీ ఓ ఫంక్షన్ హాల్లో ప్రజా ప్రభుత్వానికి రెండుళ్ళ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి జిల్లా ఇంచార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్ అనంతరం ఆర్ ఌ బి గెస్ట్ హౌస్ లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ,జిల్లా ఇంచార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్నుమర్యాద పూర్వకంగా కలసిన నంద్యాల జనసేన నాయకులు రాచమడుగు చందు, సుందర్, రాంబాబు పలువురు కలిశారు. నంద్యాల జిల్లా లో ఉండే పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించిన జనసేన నాయకులు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి విజయాలకు కృషి చేస్తామని ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అత్యధిక మెజారిటీతో మున్సిపాలిటీలు కైవసం చేసుకుంటామని తెలియజేశారు.




# రూ.245 లక్షలతో గాంధీ రోడ్డు అభివృద్ధి

- అంచలంచెలుగా చిత్తూరు నగర అభివృద్ధి
- గాంధీ రోడ్డును ప్రారంభించిన కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చిత్తూరు



**జూన్ 8, జనసంఘర్షణ** చిత్తూరు నగరాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామని, రోడ్లు అభివృద్ధి చెందితేనే నగరం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ లు తెలిపారు. చిత్తూరు నగర పరిధిలో రూ.245 లక్షలతో విస్తరించి, అభివృద్ధి చేసిన గాంధీ రోడ్డును కలెక్టర్, ఎమ్మెల్యే, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.కొంగారెడ్డి పల్లి వద్ద రూ.61 లక్షలతో నూతనంగా నిర్మించిన డివైడర్, సెంట్రల్ లైటింగ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారంతో చిత్తూరు నగరంలో రోడ్ల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కట్టమంచి - సాంబయ్యకండి గా బైపాస్ రోడ్డును మరో నెలలో పూర్తిచేసి ప్రారంభిస్తామన్నారు. దర్గా సర్కిల్ నుండి ఇరువారం వరకు రోడ్డు పనులు పూర్తి చేస్తామని, కట్టమంచి నుంచి ఎమ్మెస్సార్ సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ అభివృద్ధి కోసం రూ.37 కోట్ల నిధులు మంజూర ంఅయ్యాయని చెప్పారు. వచ్చే 9 నెలల్లో నగరంలోని ప్రధాన రోడ్లన్నింటిని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకారంతోనే చిత్తూరు అభివృద్ధి దిశగా సాగుతుందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ. ఎన్నికల ముగిసిన తర్వాత సామాజిక మాధ్యమాల్లో చిత్తూరు రోడ్ల గురించి ఎక్కువగా సందేశాలు వచ్చాయని, 40-50 ఏళ్లుగా చిత్తూరులో రోడ్ల అభివృద్ధి ముందుకు పోలేదన్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్ని ఆటంకాలు ఎదురైనా ప్రధాన రోడ్లు అన్నింటిని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకెళ్లాలని చెప్పారు. నగరంలో రోడ్ల అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్క భవన యజమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్ సహకారంతో నగరంలో రోడ్లు అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. సాంబయ్యకండిగా కట్టమంచి రోడ్డును, దర్గా సర్కిల్ నుంచి ఇరువారం రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయిస్తామన్నారు. కట్టమంచి నుంచి ఎమ్మెస్సార్ వరకు నాలుగు వరుసల రోడ్డు అభివృద్ధి కోసం రూ. 37 కోట్ల మంజూరు అయిందన్నారు. ప్రజలు, స్థానిక నాయకుల సహకారంతో చిత్తూరును అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామని, ఎన్ని ఆటంకాలు ఎదురైనా నగరంలో రోడ్లను విస్తరించి అభివృద్ధి చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఎన్నిక సమయంలో హామీ ఇచ్చిన విధంగా చిత్తూరును స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో పనిచేసి ననగరపాలక అధికారులను, సహకరించిన ట్రాన్స్కో అధికారులను ఈ సందర్భంగా సన్మానించారు.



# "నువ్వు దేవుడివి తండ్రి".. సీఎంను హత్తుకున్న అభిమాని

- నాలుగు నెలల్లో ఇల్లు కట్టించి ఇవ్వాలని సీఎం ఆదేశం.
- మెరుగైన వైద్యం అందించేందుకు ఆదేశం.

**కుప్పం,జూన్ 8 జనసంఘర్షణ:**





ఎప్పటి నుంచో తనను చూడాలనుకుంటున్న కామధేనువులంకకు చెందిన వృద్ధుడు, వీరాభిమాని సత్యనారాయణ కలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిజం చేశారు. సత్యనారాయణ ఆవేదనతో కూడిన వీడియో వైరల్ కావడంతో స్పందించిన సీఎం సోమవారం, సిద్ధాంతం 'మీ భూమి- మీ హక్కు' వేదికపైకి ఆయన్ను ప్రత్యేకంగా పిలిపించుకుని తన బస్సులో ఆత్మీయంగా ముచ్చటించారు. సత్యనారాయణ తన కుమారుడి అనారోగ్యం, గ్రామంలోని డ్రైనేజీ, రోడ్ల ఇబ్బందులను వివరించగా సీఎం ఎంతో చలించిపోయారు. అబ్బాయికి మెరుగైన వైద్యం అందిస్తామని, నాలుగు నెలల్లో పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని అక్కడికక్కడే కలెక్టర్ను ఆదేశించారు. ఈ అండతో భావోద్వేగానికి గురైన సత్యనారాయణ సీఎంను ఆప్యాయంగా కౌగిలించుకుని "నువ్వు దేవుడివి తండ్రి" అంటూ ఆనందబాష్పాలు రాల్చారు.

## కాణిపాకం దేవస్థానంలో నుండి 21 వరకు యోగా కార్యక్రమాలు

**కానిపాకం జూన్ 8 జనసంఘర్షణ**



కాణిపాకం దేవస్థానంలో నేటి నుండి 21 వరకు దేవస్థానం ఆస్థాన మండపం నందు యోగాంధ్ర ఉత్సవాలు నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి పెంచల కిషోర్ తెలిపారు. సోమవారం యోగా కార్యక్రమాన్ని ఈవో ప్రారంభించి ఆయనే స్వయంగా యోగాను చేపట్టాడు ఈ సందర్భంగా జీవో మాట్లాడుతూ ప్రతిరోజుఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు దేవస్థానం సిబ్బంది, పరిసర గ్రామస్తులు, భక్తులతో యోగ నిర్వహించడం జరుగుతుంది, సోమవారంమొదటి రోజు ప్రారంభించడం జరిగింది, ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈ. కార్యక్రమంలో ఏ ఈ ఓ లుఎస్వి కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, సూపర్డెంట్ కోదండపాణి, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పూతలపట్టు తాసిల్దారుగా పదవి బాధ్యతలు చేపట్టిన ఉదయ్ సంతోష్

**పూతలపట్టు, జూన్ 8 జనసంఘర్షణ** పూతలపట్టు తాసిల్దారుగా ఉదయ్ సంతోష్ సోమవారం పదవి బాధ్యతలు చేపట్టాడు. ఇక్కడ పనిచేసిన రమేష్ బాబు వికోటకు బదిలీ అయ్యాడు. వి కోట నుండి ఉదయ్ సంతోష్ పూతల పట్టుకో బదిలీ వచ్చాడు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తాసిల్దార్ మీడియాతో మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిశీలించి ప్రజలకు న్యాయం చేస్తానని ఆఫీస్ సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపాడు. తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది ప్రజా ప్రతినిధులు కలిశారు.



## అమ్మవారి సేవలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఆర్. రఘునందన్ రావు

**తిరుచానూరు, జూన్ 08 జనసంఘర్షణ** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఆర్. రఘునందన్ రావు సోమవారం దర్శించు కున్నారు. ఆలయం వద్ద రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కి ఆలయ ఏఈఓ దేవరాజులు, సూపరిం టెండెంట్లు రమేష్, సురేష్, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కి ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.



# ఉప్పల్ డిగ్రీ కాలేజీకి భూమి,నిధులను కేటాయించండి

**సీఎం రేవంత్రెడ్డిని కోరిన పరమేశ్వర్రెడ్డి**



**ఉప్పల్ :**
ఉప్పల్లో ప్రభుత్వ డిగ్రీ కళా శాలకు భూమితో పాటు భవనాల నిర్మాణానికి నిధులను కూడా కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మందుముల పరమేశ్వర్రెడ్డి, మాజీ కార్పొరేటర్ మందుముల రజితాప రమేశ్వర్రెడ్డి కోరారు.ఉప్పల్ భగాయత్లో సీఎం రేవంత్రెడ్డి చేతుల మీదుగా ఎంఎంసీ కార్యాలయం, 100 పడకల ఏరియా ఆస్పత్రి నిర్మాణాలకు భూమి పూజ తర్వాత జరిగిన సభ వేదికపై వజ్రేష్ యాదవ్,పరమేశ్వర్రెడ్డి, రజితాపరమేశ్వర్రెడ్డి వినతిపత్రాలను అందచేశారు.ఉప్పల్లో డిగ్రీ కళాశాలను ఐదారేళ్ల క్రితమే ఏర్పాటు చేశారన్నారు.కానీ,నేటికి డిగ్రీ కళాశాల పాఠశాల భవనంలోనే నడుస్తుందన్నారు.దీంతో ఉప్పల్ భగాయత్లో 5 ఎకరాల స్థలంతో పాటు భవనాల నిర్మాణానికి నిధులను కేటాయించాలని కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు. తక్షణమే స్థల కేటాయింపు, నిధుల కోసం నివేదికను పంపించాలని అధికారులకు ఆదేశించారు.

## ఘనంగా సీఎం సభ..ఉప్పల్ ప్రజలకు వరాలు..!

**-భారీగా ఏర్పాట్లు చేసిన వజ్రేష్ యాదవ్,పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్ :**



ఉప్పల్ భగాయత్ లో సీఎం రేవంత్ రెడ్డి సభ సూపర్ సక్సెస్ అయింది,మూసీ నది ఒడ్డున ప్రశాంత వాతావరణంలో సభ సందడిగా సాగింది.మల్కాజిగిరి పార్లమెం టు నియోజకవర్గంలోని ప్రజలకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వరాలు ప్రకటించారు. ఉప్పల్ భగాయత్ లో 10 ఎకరాలలో రూ.98 కోట్ల నిధులతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి, మల్లాపూర్ లో రూ.27 కోట్లతో ఎకరం స్థలంలో ఉప్పల్ ఏరియా ఆసుపత్రి భవనం నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ జరిగింది,ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు,రాజనరసింహ, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి,అనిల్ కుమార్ యాదవ్,పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి,మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, బండి రమేష్,మాల్ రెడ్డి రామ్ రెడ్డి,ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.సభ ఏర్పాట్లు భారీగా చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డిని అందరూ అభినందించారు.

## డీజీపీ సి.వి.ఆనంద్ను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ కార్పొరేటర్లు

**బోడుప్పల్ :**
తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సి.వి. ఆనంద్ ని మాజీ కార్పొరేటర్లు భూక్య సుమన్,సీసా వెంకటేష్ గౌడ్ సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు.తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు భద్రత



కల్పించడం, నేర నియంత్రణలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందని మాజీ కార్పొరేటర్లు పేర్కొన్నారు. సి.వి.ఆనంద్ సుదీర్ఘ పరిపాలనా అనుభవం, సమర్థవంతమైన నాయకత్వంతో పోలీసు శాఖ మరింత ప్రజలకు చేరువవుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. ప్రజల భద్రత, మహిళల రక్షణ, సైబర్ నేరాల నియంత్రణ వంటి అంశాల్లో తెలంగాణ పోలీసులు ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందారని వారు కొనియాడారు.డీజీపీ సి.వి.ఆనంద్ తమను కలిసిన మాజీ కార్పొరేటర్లకు ధన్యవాదాలు తెలియజేస్తూ, ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా పోలీసు శాఖ పనిచేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరగగా, డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం సి.వి. ఆనంద్ను కలిసి

# సీఎం రేవంత్ రెడ్డిని ఆకట్టుకున్న "త్రి జనరేషన్స్"ఫొటో

**-ఫొటో వెనుక ఉన్న ప్రత్యేకతను వివరించిన మందుముల పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్ :**
ఒక మంచి ఫొటో ఎన్నో భావోద్వేగాలను పలికిస్తుంది. తరాల మధ్య అనుబంధాన్ని ప్రతిబింబిస్తుంది.సమాజానికి ఒక సందేశాన్ని అందిస్తుంది. అలాంటి ఓ ప్రత్యేక ఫొటోనే ఉప్పల్ భగాయత్లో జరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో అందరి దృష్టిని ఆకర్షించింది. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా రూపొందించిన "త్రి జనరేషన్స్" ఫొటోను బహూకరించారు.సభ ప్రారంభానికి ముందు ముఖ్యమంత్రిని కలిసిన పరమేశ్వర్ రెడ్డి, ఆ ఫొటోలో ప్రతిబింబించిన భావాన్ని, దాని వెనుక ఉన్న ప్రత్యేకతను వివరించారు. మూడు తరాల మధ్య ఉన్న అనుబంధం, విలువలు, వారసత్వాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ ఫొటో గురించి



ఆయన వివరించగా సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తిగా విన్నారు. ఫొటోలోని సందేశం, దాని కళాత్మకత ఆయనను ఎంతగానో ఆకట్టుకున్నట్లు తెలిసింది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటోను సంతోషంగా స్వీకరించి, సభాముఖంగా ప్రదర్శించారు. వేలాది మంది ప్రజల సమక్షంలో ఫొటోను స్వీకరించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కూడా ఈ ఫొటోను ఆసక్తిగా వీక్షించారు. పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో కుటుంబ విలువలు, తరాల అనుబంధం, పెద్దల పట్ల గౌరవం వంటి అంశాలను ప్రతిబింబించే ఉద్దేశంతో "త్రి జనరేషన్స్" ఫొటోను రూపొందించినట్లు తెలిపారు. ఒక మంచి చిత్రం మాటల్లో చెప్పలేని భావాలను వ్యక్తపరుస్తుందని, అదే ఉద్దేశంతో ఈ ఫొటోను ముఖ్యమంత్రికి బహూకరించినట్లు చెప్పారు.కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు కూడా ఈ ఫొటో ప్రత్యేకతను అభినందించారు. మూడు తరాల జీవిత ప్రయాణాన్ని ఒకే చిత్రంలో ప్రతిబింబించే ప్రయత్నం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆసక్తి కనబర్చి ఫొటోను స్వీకరించడం,దాని గురించి తెలుసుకోవడం కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చిందన్నారు.ఉప్పల్ భగాయత్ సభలో అభివృద్ధి కార్యక్రమాల ప్రకటనలతో పాటు ఈ "త్రి జనరేషన్స్" ఫొటో కూడా ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రిని ఆకట్టుకున్న ఈ ఫొటో సభకు హాజరైన వారిలో ఆసక్తిని రేకెత్తించడమే కాకుండా, తరాల అనుబంధం అనే సందేశాన్ని మరోసారి గుర్తు చేసింది.

# ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వం పాలించే హక్కు లేదు

**-ఖాళీ పోస్టుల భర్తీ,కాంట్రాక్టు,ఔట్సోర్సింగ్ శాశ్వత నియామకాల కోసం ఉద్యమిస్తాం**

**-ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి**

**-ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో కలెక్టర్ కు వినతి**



**ఉప్పల్ :**
తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా, ప్రభుత్వ శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు నిరుద్యోగ యువత వయోపరిమితి దాటిపోతూ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొందన్నారు,అయినప్పటికీ ప్రభుత్వం ఖాళీలపై పూర్తి వివరాలు వెల్లడించకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు.ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి బదులుగా కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం ద్వారా యువతకు ఉద్యోగ భద్రతను దూరం చేస్తున్నారన్నారు. ఇది నిరుద్యోగ యువత పట్ల అన్యాయం మాత్రమే కాకుండా ప్రజా సేవల నాణ్యతను కూడా దెబ్బతీస్తోందన్నారు.ప్రభుత్వ విద్యారంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటం, మౌలిక వసతుల కొరత, నిధుల లోపం కారణంగా ప్రభుత్వ విద్య బలహీన పడుతోందన్నారు . ఇదే సమయంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో విద్యార్థులు, తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని, ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయడంలో విఫలమవుతోందన్నారు.రాష్ట్రంలోని అన్ని శాఖల ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ విధానాలను రద్దు చేసి శాశ్వత నియామకాలు చేపట్టాలని, టీజీపీఎస్సీ ద్వారా వార్షిక నియామక క్యాలెండర్ ప్రకటించాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్య సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, వికాస్ రెడ్డి, గిరి బాబు

# భగవాన్ దాస్ పోరాటంతోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ

**బీఆర్ జయంతి వేడుకలో వరంగల్ ఎంపీ కడియం కావ్య**

**కోచ్ ఫ్యాక్టరీకి భగవాన్ దాస్ పేరు పెట్టాలి**

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**హనుమకొండ :**
బీఆర్ భగవాన్ దాస్ పోరాటంతోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమ రూపం సంతరించుకుని నేడు నిజం కాబోతున్నదని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. సోమవారం సీనియర్ కమ్యూనిస్టు యోధుడు, కార్మిక నాయకులు బీఆర్ భగవాన్ దాస్ 96వ జయంతి వేడుకలు హనుమకొండ అశోక జంక్షన్ లోని బీఆర్ భగవాన్ దాస్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు బీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ భగవాన్ దాస్ పోరాటంతోనే కోచ్ ఫ్యాక్టరీ సాధ్యమై నేడు పూర్తి కాబోతున్నదని, తద్వారా ఈ ప్రాంతంలో వేలాది మంది యువతకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలు అందనున్నాయని అన్నారు. అలాగే వరంగల్ కు




తాగు నీరు, సాగునీటి కోసం బీఆర్ భగవాన్ దాస్ పోరాడాలని, భూ పోరాటాలు నిర్వహించి పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధించి పెట్టారని అన్నారు. తన జీవిత కాలం బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన భగవాన్ దాస్ రాష్ట్ర స్థాయిలో సిపిఐకి పేరు తీసుకు వచ్చారని అన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ, సిపిఐ ఎప్పుడూ మిత్ర పక్షాలుగా కొనసాగుతూ రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు కలిసి ముందుకు సాగుతున్నాయని అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి భగవాన్ దాస్ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన పోరాటంతోనే కోచ్ ఫ్యాక్టరీ వచ్చిందని అన్నారు. బీఆర్ ఆశయాలకు అనుగుణంగా మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. భగవాన్ దాస్ చూపిన బాటలో కమ్యూనిస్టు కార్యకర్తలుగా ముందుకు సాగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, భగవాన్ దాస్ కుమారులు డాక్టర్ బి. రాజ్ సిద్ధార్థ, బీఆర్ లెనిన్, బిఆర్ఎస్ నాయకులు మేడిపల్లి శోభన్

జన సంఘర్షణ
మంగళవారం
09 జూన్ 2026

## జీ కి దక్కిన వృషకర్మ శాటిలైట్ హక్కులు ?

తండేల్ తర్వాత అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ 'వృషకర్మ' మూవీకి విరూపాక్ష ఫేం కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నాడు. మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో లక్కీ భాస్కర్ ఫేం మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది.. 2026 డిసెంబర్‌లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. వృషకర్మ శాటిలైట్‌రైట్స్‌ను పాపులర్ టీవీ ఛానల్ జీ తెలుగు దక్కించుకున్నట్టు సమాచారం. జీ తెలుగు భారీ మొత్తానికి వృషకర్మ శాటిలైట్ రైట్స్‌ను కొనుగోలు చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన కూడా చేయనున్నారట మేకర్స్. వృషకర్మ లో 'లాపతా లేడీస్' ఫేం స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా కనిపించనుండటంతో.. ఇంతకీ క్రేజీ యాక్టర్‌ను డైరెక్టర్ కార్తీక్ దండు ఎలాంటి పాత్రలో చూపించబోతున్నాడన్నది మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై స్టార్ డైరెక్టర్ సుకుమార్ బీవీఎస్ఎన్ ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి.లోక్‌నాథ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

## అభిమానులతో కలసి పెద్దిని వీక్షించిన రామ్‌చరణ్




గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన నటించిన 'పెద్ది' చిత్రాన్ని ఆదివారం రాత్రి చిత్రబృందం, అభిమానులతో కలిసి వీక్షించారు. సినిమాకు వస్తున్న స్పందన, పలు సన్నివేశాలకు ప్రేక్షకులు కనెక్ట్ అయిన తీరును గమనించిన ఆయన ఒకింత భావోద్వేగానికి లోనై కంట తడిపెట్టుకున్నారు. కొన్ని సన్నివేశాలకు ఆడియన్స్ రియాక్ట్ అయిన తీరు చూసి ఆనందించారు. ఈ వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో వెంకట సతీశ్ కిలారు నిర్మించిన ఈ చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చి వసూళ్ల వర్షం కురిపిస్తోంది. మూడు రోజుల్లో ఈ చిత్రం రూ.236 కోట్లు కలెక్ట్ చేసింది. మొదటి మూడు రోజులు థియేటర్ల దగ్గర అభిమానులు హవా కొనసాగగా, వీకెండ్ నుంచి ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు క్యూ కడుతున్నారు. మరో పక్క జాన్వీకపూర్ పోషించిన పాత్రపై ట్రోలింగ్ జరగగా దర్శకుడు క్షమాపణ చెప్పి అభ్యంతరకర సన్నివేశాలను తొలగిస్తామని తెలిపారు.


## రామాయణంలో భాగం కావడం అదృష్టం: కాజల్



సినీప్రియులందరి దృష్టి ప్రస్తుతం 'రామాయణ' మీదే ఉంది. బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతోన్న ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్.. రాముడి పాత్రలో, సీతగా సాయి పల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. విలక్షణ నటుడు యశ్.. రావణుడిగా కనిపించనున్నారు. ఆయన సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆమె ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఓ అవార్డు వేడుకకు హాజరైన కాజల్ ఈ సినిమా గురించి మాట్లాడారు. తన కెరీర్లోనే ఇలాంటి బిగ్ ప్రాజెక్ట్ చేయడం మొదటిసారి అని అన్నారు. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. భారీ స్థాయిలో 'రామాయణ' రానుంది. గతంతో నితేశ్ తివారీఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. 5వేల సంవత్సరాలకు పైగా కోట్లాది హృదయాలను పాలిస్తున్న ఈ ఇతిహాసాన్ని తెర పైకి తీసుకురావడానికి దశాబ్దం నుంచి అన్వేషణ ప్రారంభించాం. మా చిత్రబృందం ఈ చిత్రం కోసం విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తూనే ఉంది.

# పెద్ది కలెక్షన్ల సునామీ

**300 కోట్ల వసూళ్లకు చేరువలో వసూళ్లు**




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన భారీ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ప్రదర్శన కొనసాగిస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే రికార్డు స్థాయి వసూళ్లు సాధిస్తున్న ఈ చిత్రం, ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్ల వర్షం కురిపిస్తూ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్య పరుస్తోంది. విడుదలైన మొదటి రోజే 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా రూ.135.36 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. ఆ తర్వాత రెండో రోజు రూ.46.44 కోట్లు, మూడో రోజు రూ.54.90 కోట్లు రాబట్టిన ఈ చిత్రం, తొలి మూడు రోజుల్లోనే రూ.236.7 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటింది. ఆదివారం కూడా అదే జోరు కొనసాగించిన 'పెద్ది' మొదటి వీకెండ్ ముగిసే సరికి ప్రపంచవ్యాప్తంగా రూ.292.5 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేస్తూ, సినిమాను 'బాక్సాఫీస్ ఛాంపియన్'గా అభివర్ణించింది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ చిత్రం అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. అమెరికా, ఆస్ట్రేలియా, యూకే వంటి కీలక మార్కెట్లలో రామ్ చరణ్‌కు ఉన్న క్రేజ్ మరోసారి ఈ వసూళ్ల ద్వారా స్పష్టమైంది. నాలుగు రోజుల్లోనే దాదాపు రూ.300 కోట్లకు చేరువైన ఈ సినిమా, వీక్‌డేస్‌లో కూడా ఇదే స్థాయిలో కలెక్షన్లు కొనసాగిస్తే త్వరలోనే రూ.500 కోట్ల క్లబ్‌లో చేరే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ 'అచ్చీయమ్మ' పాత్రలో నటించారు. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ కీలకమైన కోచ్ పాత్రలో కనిపించగా, జగపతిబాబు 'అప్పలసూరి'గా, దివ్యేందు శర్మ మరో ముఖ్యమైన పాత్రలో నటించారు.

# పెద్దిలో మంచి పాత్రను చేశా

**జాన్వీని ట్రోల్ చేయడం తగదన్న జగపతిబాబు**



'పెద్ది' బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోతోంది. సినిమాలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు జగపతిబాబు తాజాగా ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ చిత్రంలో 'అప్పలసూరి' పాత్రలో నటించిన జగపతిబాబు, 'పెద్ది' తన కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని పేర్కొన్నారు. మధ్యలో ఎన్నో సినిమాలు చేసినప్పటికీ, ఈ సినిమా విడుదల కోసం ప్రత్యేకంగా ఎదురుచూశానని తెలిపారు. చిత్రం విడుదల తర్వాత ఒక ప్రముఖ దర్శకుడు తనకు ఫోన్ చేసి, 'ఇంత గొప్ప పాత్ర చేసినా మీ గురించి పెద్దగా చర్చ జరగడం లేదు. ఇదే పాత్రను మరో భాష నటుడు చేసి ఉంటే ఇప్పటికే ఎన్నో అవకాశాలు వచ్చేవని చెప్పినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీలో నటులకు లభించే గుర్తింపు గురించి కూడా జగపతిబాబు మాట్లాడారు. 'చాలా సందర్భాల్లో పరభాష నటులకు ఎక్కువ గౌరవం దక్కుతుంది. నేను ఇతర భాషల్లో పని చేసినప్పుడు కూడా అలాంటి ఆదరణను చూశాను. అయితే నాకు దానిపై ఎలాంటి అసంతృప్తి లేదు. కానీ 'పెద్ది' కోసం నేను ఎంత కష్టపడ్డానో నాకు తెలుసు' అని అన్నారు. షూటింగ్ సమయంలో తన పాత్రకు వచ్చిన స్పందనను గుర్తుచేసుకుంటూ, ప్రతి సన్నివేశం పూర్తయిన తర్వాత యూనిట్ సభ్యులు చప్పట్లు కొట్టేవారని చెప్పారు. సినిమా కోసం నా శక్తి మేరకు పనిచేశాను. అందుకే ఈ పాత్రకు మరింత గుర్తింపు రావాలని కోరుకోవడంలో తప్పేమీ లేదు. ఈ సినిమా కోసం నేను నా ప్రాణం పెట్టాను. అందుకే గుర్తింపు అడిగే హక్కు నాకు ఉంది. మిగతా సినిమాల విషయంలో నేను ఎప్పుడూ ఇలా మాట్లాడలేదు అని స్పష్టం చేశారు. ఇక 'పెద్ది'లో హీరోయిన్ జాన్వీ కపూర్ పాత్రపై సోషల్ మీడియాలో వస్తున్న విమర్శల గురించి కూడా జగపతిబాబు స్పందించారు. నటీనటులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ చేయడం సరికాదని అన్నారు.జాన్వీ కపూర్ తనకు అప్పగించిన పాత్రను దర్శకుడు చెప్పిన విధంగానే చేసింది. ఒక పాత్ర లేదా కొన్ని సన్నివేశాలు ప్రేక్షకులకు నచ్చకపోవచ్చు. కానీ దాని కోసం నటిని వ్యక్తిగతంగా విమర్శించడం సరైంది కాదు. కొన్నిసార్లు మంచి ఉద్దేశంతో చేసిన అంశాలు కూడా ప్రేక్షకుల వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. అంత మాత్రానికే ఒక ఆర్టిస్టును మానసికంగా ఇబ్బంది పెట్టేలా ట్రోల్ చేయడం మంచిది కాదు. ఈ విషయంలో నేను పూర్తిగా జాన్వీకి మద్దతు ఇస్తానని చెప్పారు.

# బాలకృష్ణపై భోలా బాలయ్య గీతం విడుదల



పని చేసేవాళ్లని ప్రపంచం ఇష్టపడుతుంది. పని చేయడమన్నా, సమాజ సేవ అన్నా బాలకృష్ణకు ఎక్కడ లేని ఉత్సాహం వస్తుంది. ఆయన అభిమానులు ఆ విషయాన్నే స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేస్తుండడం అభినందనీయం అన్నారు ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీను. ఆయన ముఖ్య అతిథిగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో భోళా బాలయ్య... పాట ఆవిష్కరణ వేడుక జరిగింది. అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజుని పురస్కరించుకుని ఆయన వ్యక్తిత్వంపై రూపొందిన గీతమిది. పాట విడుదల అనంతరం బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'తెరపై మంచి చేసే హీరోని చూసి వెళ్లిపోవడం కాదు. ఆయన చేసిన ఆ మంచిని స్ఫూర్తిగా తీసుకోవాలి. బాలకృష్ణ అభిమానులు ఆ దిశగానే సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. బాలకృష్ణ అంటే ఏమిటో నేను ఇప్పటికే సినిమాలతో చూపించా. ఆయన అభిమానులు ఏటా పుట్టినరోజు వేడుకని ఓ పండుగలా చేసుకుంటారు. భోళా బాలయ్య పాట చాలా బాగుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.బి.కె.హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు అనంతపురం జగన్, గీత రచయిత దివాకర్ అమిలినేని, గాయకుడు కరీముల్లా, సంగీత దర్శకుడు ఈశ్వర్ దత్తు తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co